క్లుప్తంగా

జీఎస్టీ 2.0పై విద్యార్థులకు పోటీలు



విజేతలతో రిజిస్ట్రార్ డాక్టర్ జి.శ్రీనివాస్

కర్నూలు సిటీ: జీఎస్టీ తగ్గింపుపై ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకొని ప్రయోజనాలు పొందాలని క్లస్టర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ జి.శ్రీనివాస్ సూచించారు. జీఎస్టీ 2.0పై బుధవారం విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, పెయింటింగ్, పోస్టర్ ప్రజెంటేషన్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అలాగే జిల్లా, రాష్ట్ర స్థాయిలో నిర్వహించే పోటీల్లో పాల్గొని విజేతలుగా నిలవాలని ఆకాంక్షించారు. వర్సిటీ పరిధిలోని డిగ్రీ కాలేజీల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి



ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

కర్నూలు(సెంట్రల్): కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు పట్టణ ప్రాంతాల్లోని పేదలకు రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లోని వారికి మూడు సెంట్లు చొప్పున ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఐ నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం సీపీఐ ఆధ్వర్యంలో కుమ్మరివీధి, చిత్తారివీధి, గనిగల్లి గంగరాజు వీధి, మంగలి వీధి, నడిగడ్డ వీధులకు సంబంధించి 10, 11, 12 సచివాలయాల వద్ద ధర్నా నిర్వహించారు. పేదలకు ఇంటి స్థలంతోపాటు నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నాయకులు దంబోళం శ్రీనివాసరావు, అన్వర్‌బాషా, రఫియా, దేవిబాయ్, నూర్జహాన్ ఆయా కాలనీవాసులు పాల్గొన్నారు.

ఘనంగా వాల్మీకి విగ్రహ ప్రతిష్ఠ



విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న ఎమ్మెల్సీ మధుసూదన్ తదితరులు

వెల్దుర్తి: మండలంలోని గోవర్ధనగిరి గ్రామంలో వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్ఠ బుధవారం ఘనంగా జరిగింది. వాల్మీకి గ్రామ సంఘం నాయకులు రామచంద్రుడు, మద్దిలేటి, ఓబులేషు, నాగమద్ది, నాగేషు, నడిపి బద్దయ్య, తలారి దస్తగిరి తదితరుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్సీ డాక్టర్ ఏ మధుసూదన్, వాల్మీకి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ వలసల రామకృష్ణ, ఆలూరు జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రామ్‌భీమ్ నాయుడు, వాల్మీకి జాతీయ కార్యదర్శి ఆస్పరి శ్రీనివాసులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ప్రతిష్ఠోత్సవం, హోమ పూర్ణాహుతి, పూజల్లో పాల్గొన్నారు. నాయకులు, పీఠాధిపతులు రామళ్లకోట మాధవస్వామి, బొమ్మిరెడ్డిపల్లె సుబ్బరాయుడు, బలరాం గౌడ్, బోగోలు కమలాకర్, చెరుకులపాడు రామాంజనేయులు, కల్లూరు రామచంద్రారెడ్డి, బొమ్మిరెడ్డి పల్లె లక్ష్మిరెడ్డి, గోనెగండ్ల రమేశ్ నాయుడు, సూదేపల్లె జయరాముడు, సిద్దినగట్టు వెంకటేశ్వర్లు, ప్రతాప్ నాయుడు, వెల్దుర్తి రామచంద్రుడు, నాగన్న, శ్రీను, వెంకటేశ్వర్లు, ఆనంద్, మదార్‌పురం మురళి పాల్గొన్నారు.

ప్రభుత్వంపై పోరాడుదాం



బోయబొంతిరాళ్లలో కృష్ణమూర్తి స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

కృష్ణగిరి: రైతులను విస్మరిస్తున్న కూటమి ప్రభుత్వంపై పోరాడదామని సీపీఐ నాయకులు పిలుపునిచ్చారు. జిల్లాలో ఉల్లి, టమాట రైతులను ఆదుకోవడం మానేసి కూటమి ప్రభుత్వం జీఎస్టీ సంబరాలు చేయడం విడ్డూరంగా ఉందని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామాంజనేయులు విమర్శించారు. మండలంలోని బోయబొంతిరాళ్ల గ్రామంలో సీపీఐ మండల కార్యదర్శి, గ్రామ సర్పంచ్ రవి మోహన్ అధ్యక్షతన బుధవారం కామ్రేడ్ పెద్ద మాదన్న, కృష్ణమూర్తి వర్ధంతి సందర్భంగా వారి స్థూపాల వద్ద నివాళులర్పించారు. రామాంజనేయులు, జిల్లా కార్యదర్శి గిడ్డయ్య మాట్లాడుతూ గ్రామంలో చదువుల రామయ్య కాలనీ, ఆలంకొండ నుంచి బోయబొంతిరాళ్ల వరకు రహదారి ఏర్పాటుకు అప్పటి సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి కామ్రేడ్ సురవరం సుధాకర్‌రెడ్డితో భూమి పూజ చేయించారని గుర్తు చేశారు. రాష్ట్రంలో పాలన పూర్తిగా గాడి తప్పిందని దుయ్యబట్టారు. పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. జిల్లా సహాయ కార్యదర్శి లెనిన్‌బాబు, నాయకులు నబీరసూల్, సుంకయ్య, పరమేశ్వరరెడ్డి, ఖలీల్‌బాషా, మధు, మల్లికార్జున, ఆనసూయమ్మ, మాధవ కృష్ణ పాల్గొన్నారు.

కంటిచూపులో కోత!

- పిల్లల నుంచి పెద్దల వరకు దృష్టిలోపాలు
- బ్లూ స్క్రీన్ అతి వాడకంతో ఇబ్బందులు
- కళ్లు పొడిబారడం, ఎర్రబడటం, నీరు లేక పొడిగా కావడం సమస్యలు
- కంటి వైద్యుల వద్దకు క్యూ కడుతున్న జనం
- నేడు వరల్డ్ సైట్ డే



కంటి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

కర్నూలు(హాస్పిటల్): ఒకప్పుడు ఏదైనా బస్సులో ప్రయాణం చేస్తుంటే దాదాపుగా అందరూ ఏదో ఒక పుస్తకం లేదా పత్రికను పట్టుకుని చదువుతూ కనిపించేవారు. కానీ ఇప్పుడు అందరి చేతిలో మొబైల్ ఫోన్‌లు ఉంటున్నాయి. బస్సు ఎక్కినప్పటి నుంచి దిగేంత వరకు వాటినే తదేకంగా చూస్తూ గడిపేస్తున్నారు. ఇలా గంటల తరబడి మొబైల్‌ను చూడటం వల్ల వాటి నుంచి వచ్చే అతినీలలోహిత కిరణాలు కంటిపై పడి దృష్టి లోపాలు, సమస్యలు వస్తున్నాయి. పిల్లల నుంచి వృద్ధుల వరకు దృష్టి లోపాలతో ఇబ్బందులు పడుతున్న వారి సంఖ్య భారీగా పెరిగింది. ఈ నెల 9వ తేదీన వరల్డ్ సైట్ డే సందర్భంగా ప్రత్యేక కథనం.

ప్రస్తుతం జనాభాలో 60 శాతానికి ప్రజలు రోజులో 6 గంటలకు పైగా మొబైల్ తెరలోనే గడుపుతున్నారని అంచనా. ఇందులో యువతీయువకులు రోజులో 10 గంటలకు పైగా ఈ స్క్రీన్‌నే చూస్తున్నారని వైద్యులు చెబుతున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో కర్నూలు, నంద్యాల, ఆదోని ప్రాంతాల్లో 80 మందికి పైగా కంటి వైద్యులున్నారు. వీరి వద్దకు నిత్యం 20 నుంచి 40 మంది వరకు దృష్టిలోపాలు, సమస్యలతో చికిత్స కోసం వస్తున్న వారు ఉంటున్నారు. ఇప్పటి తరానికి ఒంటరిగా ఉన్నా, పదిమందిలో కూర్చున్నా, బస్సు, రైలు ప్రయాణాలతోపాటు బైక్‌పై ప్రయాణించినా మొబైల్‌నే చూస్తూ గడుపుతున్నారు. మొబైల్ ఫోన్లు, టీవీలు, కంప్యూటర్లు, ల్యాబ్‌టాప్‌లలోని కృత్రిమ కాంతిలో ఉండే అతినీలలోహిత(బ్లూలైట్) కిరణాల వల్ల కంటి సమస్యలు అధికమవుతున్నాయని వైద్యులు చెబుతున్నారు. వీటితో పాటు కొందరు పిల్లల్లో ఏ విటమిన్ లోపం వల్ల రేచీకటి, గ్లకోమా, జీరాఫ్తాల్మియా వంటి కంటి జబ్బులు వస్తున్నాయి. పోషకాహారలోపం కారణంగా పిల్లల్లో ఈ రకమైన విటమిన్ లోపిస్తోంది. మరికొంత మందికి పుట్టుకతోనే కంటి జబ్బులు వస్తున్నాయి. దీనికి జన్యుపరమైన కారణాలు, మేనరికపు వివాహాలు, గర్భంతో తల్లి తీసుకునే కొన్ని రకాలైన మందుల వల్ల ఇది ఏర్పడుతోంది. మేనరికం వల్ల రెటినైసిస్ పిగ్మెంటోజా అనే వ్యాధి పిల్లల్లో వస్తోంది. ఆర్‌వోపీ అనే వ్యాధి ప్రీమెచ్యూర్ పిల్లల్లో వస్తోంది. ఇలాంటి వ్యాధులను సకాలంలో గుర్తించేందుకు కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంట్రవెన్షన్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు.

ఏడాది పిల్లల నుంచే అలవాటు

మొబైల్ వ్యసనం ఇప్పుడు ఏడాది వయస్సు నుంచే పిల్లల్లో ప్రారంభం అవుతోంది. వారు మొబైల్ ఫోన్ పట్టుకున్నారంటే గంటల తరబడి వదలడం లేదని వైద్యుల ముందు తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా మూడేళ్లలోపు పిల్లలు మొబైల్‌లో వచ్చే రైమ్స్‌లోని కలర్స్‌కు ఆకర్షితులవుతున్నారు. ఫలితంగా వారికి ఏది తినిపించాలన్నా చేతికి మొబైల్ ఫోన్ ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడింది. కొందరు చిన్నారులు అర్ధరాత్రి వరకు మొబైల్ ఫోన్‌ను వదలడం లేదు.

■ ఇది కూడా ఒక రోగమే!

నిత్యం మొబైల్ ఫోన్‌ను చూస్తూ గడపటాన్ని కంప్యూటర్ విజన్ సిండ్రోమ్ అనే వ్యాధిగా పిలుస్తారని వైద్యులు చెబుతున్నారు. ఇది ఎక్కువ కాలం కంప్యూటర్లు, సెల్‌ఫోన్లు, టీవీలు చూడటం వల్ల వస్తుంది. కళ్లు తీవ్ర ఒత్తిడికి గురికావడం, కళ్లు అలసిపోవడం, కళ్లలో మంటలు, కళ్లు ఎరుపు కావడం, ఒక వస్తువు రెండుగా కనిపించడం, కళ్లు పొడిబారడం, నల్లగుడ్డు పొడిబారడం, మయోపియా (దృష్టిలోపం) ఎక్కువ కావడం వంటి లక్షణాలు కనిపిస్తాయి.



నేడు ఆసుపత్రిలో అవగాహన ర్యాలీ



వరల్డ్ సైట్ డే సందర్భంగా ప్రాంతీయ ప్రభుత్వ కంటి ఆసుపత్రి నుంచి ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో అవగాహన ర్యాలీ నిర్వహించనున్నాం. జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో స్థానిక కేవీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించి అక్కడి విద్యార్థినులకు అవగాహన కల్పించనున్నాం. దృష్టిలోపాలకు కారణాలు, నివారణ మార్గాలను ప్రజలకు వివరిస్తాం.

– డాక్టర్ ఎం.సత్యనారాయణరెడ్డి, సూపరింటెండెంట్, ఆర్ఈహెచ్, కర్నూలు

బ్లూలైట్‌తో దృష్టిలోపాలు



ఇటీవల కంప్యూటర్, ల్యాప్‌టాప్, మొబైల్‌ఫోన్ వాడకం తప్పనిసరి అయ్యింది. మరికొందరికి ఇది వ్యసనంగా మారింది. ఎక్కువసేపు స్క్రీన్ చూడటం వల్ల వాటిలోని నీలి కాంతి కళ్లపై పడి దృష్టి లోపాలు వస్తున్నాయి. మా వద్దకు వచ్చిన వారిలో అధికంగా కళ్లు పొడిబారడం, కళ్లు ఎర్రగా కావడం, కళ్ల మంటలు, కంట్లో దురద వంటి సమస్యలు ఉంటున్నాయి. సాధ్యమైనంత వరకు మొబైల్ ఫోన్, ల్యాప్‌టాప్‌లకు దూరంగా ఉండాలి. అత్యవసరమైతేనే వాటిని ఉపయోగించాలి.

– డాక్టర్ ఎస్.మునీరాబేగం, కంటి వైద్యనిపుణులు, కర్నూలు

విధుల్లో కొనసాగించకుంటే ఆమరణ నిరాహార దీక్ష

కర్నూలు కల్చరల్: యూజీసీ (క్లాజ్ 13) గైడ్ లైన్స్ ప్రకారం తమను విధుల్లో కొనసాగించాలని రాయలసీమ యూనివర్సిటీ కాంట్రాక్ట్ టీచర్స్ అసోసియేషన్ (సీటీఏఆర్‌యూ) నాయకులు బుధవారం వర్సిటీ అధికారులకు నోటీస్ పంపినట్లు అసోసియేషన్ కార్యదర్శి డాక్టర్ బి.సాయినాథ్ పేర్కొన్నారు. విధుల్లో చేరిన రెండవ సంవత్సరం రివ్యూ జరిపి తర్వాత నుంచి ఏటా సెల్ఫ్ అప్రైజల్ రిపోర్ట్ తీసుకొని విధుల్లో కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. నలుగురు ఉద్యోగులు న్యాయస్థానాన్ని ఆశ్రయించి మినిమం టైం స్కేల్ కింద 2017 నుంచి ఎలాంటి బ్రేక్ లేకుండా కొనసాగుతున్నారని వివరించారు. మిగిలిన స్టాఫ్ సైతం సమాన పనికి సమాన వేతనం కోసం కోర్టు మధ్యంతర ఉత్తర్వులు పొందారని తెలిపారు. అయితే రాష్ట్ర ఉన్నత విద్యా మండలి (ఏపీఎస్‌సీహెచ్‌ఈ) ఇటీవల కాంట్రాక్ట్ సిబ్బంది పని తీరుపై సమీక్ష నిర్వహించేందుకు సర్క్యులర్ జారీ చేసిందని పేర్కొన్నారు. 20 ఏళ్లకుపైగా విధులు నిర్వహిస్తున్న స్టాఫ్‌పై యాప్సీ ఆదేశాలకు అనుగుణంగా చర్యలకు దిగడం సరైందని కాదని వాపోయారు. వర్సిటీ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించుకుంటే దశల వారీగా ఉద్యమం చేపట్టి ఆమరణ నిరాహార దీక్షకు దిగుతామని, న్యాయపరంగా పోరాటం చేస్తామని వర్సిటీ అధికారులకు ఇచ్చిన వినతి పత్రంలో పేర్కొన్నారు.

నేడు జిల్లా కాంగ్రెస్ కార్యవర్గ సమావేశం

కర్నూలు(సెంట్రల్): జిల్లా కాంగ్రెస్ కార్యవర్గ సమావేశాన్ని గురువారం కళా వెంకట్రావు భవనంలో నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా ఇన్‌చార్జ్ జే.లక్ష్మీ నరసింహయాదవ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ఏపీ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి గణేష్‌కుమార్ యాదవ్, ఏపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్‌వలి హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. పార్టీ అన్ని నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌లు, నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

మెరుగైన వైద్యసేవలందించండి



మాట్లాడుతున్న సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు

కర్నూలు(హాస్పిటల్): ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది రోగులకు అందుబాటులో ఉండాలని, క్యాజువాలిటీలో మెరుగైన వైద్య సేవలు అందించాలని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు ఆదేశించారు. బుధవారం ఆసుపత్రిలోని ధన్వంతరి హాలులో హెచ్ఓడీలు, ప్రొఫెసర్లతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఐబీఆర్ఎస్, ఎన్‌టీఆర్ వైద్యసేవ, ఈ–హాస్పిటల్‌తో పాటు పలు అంశాలపై చర్చించారు. ఓపీ, ఐపీ డిశ్చార్జ్ ఫార్మసీ డేటా ఎంట్రీ ప్రాసెస్, ఈ–హాస్పిటల్‌లో అమలు, పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. వైద్యసేవలలో సమయపాలన, నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలని చెప్పారు. ఆసుపత్రిలో తరచూ తనిఖీలు చేస్తామని, విధుల్లో లేని అసిస్టెంట్ ప్రొఫెసర్లపై చర్యలు తీసుకుంటామన్నారు. శానిటేషన్ సిబ్బంది అన్ని విభాగాలను శుభ్రంగా ఉంచాలన్నారు. ఈ నెల 16న ప్రధాని మోదీ పర్యటన దృష్ట్యా వైద్యులు, సిబ్బందికి సెలవులు రద్దు చేస్తున్నట్లు తెలిపారు. ఇన్‌చార్జ్ సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ వెంకటరమణ, కేఎంసీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ హరిచరణ్, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ సింధు సుబ్రహ్మణ్యం, వైద్యులు పాల్గొన్నారు.

హోమ్ హెల్త్‌కేర్ సేవలు ప్రారంభం

కర్నూలు(హాస్పిటల్): కర్నూలులోని మెడికవర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో హోమ్ హెల్త్‌కేర్ సేవలను బుధవారం ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు, డీసీహెచ్ఎస్ డాక్టర్ జఫ్రుల్లా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హెల్త్‌కేర్ సేవల ద్వారా రోగులకు తక్షణ వైద్య సహాయం అందుతుందని చెప్పారు. హాస్పిటల్ క్లస్టర్ హెడ్ వై.మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ.. హోమ్ హెల్త్‌కేర్ సర్వీస్ సదుపాయం ద్వారా శాంపిల్ కలెక్షన్, కేర్‌టేకర్, నర్సింగ్, డాక్టర్ విజిట్, హెల్త్ చెకప్ ప్యాకేజీలు, మెడిసిన్ డెలివరీ, ఫిజియోథెరపి, టెలికన్సల్టేషన్ వంటి సేవలు లభిస్తాయన్నారు.

గిట్టుబాటు ధర కల్పించకుంటే అప్పులపాలే!



కోడుమూరులో ఉల్లి రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి

కోడుమూరు రూరల్: ఉల్లికి ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించలేకపోతే అప్పుల ఊబిలో కూరుకుపోవాల్సిందేనని రైతులు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి వద్ద వాపోయారు. ఎమ్మెల్యే బుధవారం కోడుమూరులో ఉల్లి పొలాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఉల్లి దిగుబడులు బాగున్నా మార్కెట్లో గిట్టుబాటు ధర లేక తీవ్రంగా నష్టపోతున్నామని, ఉల్లిని కొనే నాథుడు లేక గొర్రెలకు, పశువులకు మేతగా వదిలేసుకుంటున్నామంటూ రైతులు వాపోయారు. ఇప్పటికే చాలామంది రైతులు ఉల్లి పంటపై ఆశలు వదిలేసుకున్నారని, ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు.

గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆదుకుంది

పంట బీమా ప్రీమియం కూడా తామే చెల్లించాల్సి వస్తుండడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, జగనన్న పాలనలో ఏనాడూ ఇలాంటి సమస్య లేదన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పంటలకు బీమా చేసి నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించి ఆదుకునేందంటూ రైతులు ఎమ్మెల్యేకు తమ సమస్యలను ఏకరువు పెట్టారు. రైతుల ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానంటూ ఎమ్మెల్యే అక్కడి నుంచి వెళ్లిపోయారు. అంతకు ముందు ఎమ్మెల్యే దస్తగిరి కోడుమూరు వ్యవసాయ శాఖ కార్యాలయంలో సబ్సిడీ శనగ విత్తనాల పంపిణీని ఏఓ రవిప్రకాష్‌తో కలిసి ప్రారంభించారు.

నీటి మళ్లింపు ప్రారంభం

సి.బెళగల్: మండలంలోని తుంగభద్ర నది నుంచి క్రిష్ణదొడ్డి ఎత్తిపోతల పథకానికి నీటి మళ్లింపును ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి ప్రారంభించారు. ఆయన బుధవారం మండల పరిధిలోని గుండ్రేవులకు చేరుకుని నదికి గంగపూజ, మోటార్లకు పూజలు నిర్వహించిన అనంతరం స్విచ్ ఆన్‌చేసి నది నీటిని క్రిష్ణదొడ్డి ఎత్తిపోతల పథకానికి మళ్లించారు. ఇరిగేషన్ డీఈ సుబ్బారాయుడు, ఏఈ సూర్యప్రకాష్, తహసీల్దార్ వెంకటలక్ష్మి, ఎంపీడీఓ రాణెమ్మ, సాగునీటి సంఘాల చైర్మన్లు, సభ్యులు పాల్గొన్నారు.

ఆర్‌ఎస్‌కేల్లో సబ్సిడీ శనగ విత్తనాలు



రామళ్లకోటలో మాట్లాడుతున్న డీఏఓ పీఎల్ వరలక్ష్మి

వెల్దుర్తి: జిల్లాలోని ఆర్‌ఎస్‌కేల్లో రబీ సీజన్‌కు అవసరమైన శనగ విత్తనాలు క్వింటా 25 శాతం సబ్సిడీతో అందుబాటులో ఉంచినట్లు జిల్లా వ్యవసాయ శాఖాధికారి పీఎల్ వరలక్ష్మి తెలిపారు. క్వింటా ధర రూ.7,800 ఉండగా సబ్సిడీ రూ.1950 పోనూ రైతు వాటా రూ.5,850 చెల్లించాలన్నారు. బుధవారం రామళ్లకోట గ్రామంలో జాతీయ ఆహార నూనె గింజల పథకం–వాల్యూ చైనఖ్ క్లస్టర్ పథకంలో భాగంగా నల్లారెడ్డి స్వామి రైతు ఉత్పత్తి దారుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొని సంఘం ఆధ్వర్యంలో నీటి వసతి గల రైతులకు ఉచితంగా వేరుశనగ విత్తనాలను పంపిణీ చేశారు. గ్రామంలో జరిగిన పంట నమోదు, క్షేత్ర స్థాయిలో పసుపు పంటను పరిశీలించారు. అనంతరం బొమ్మిరెడ్డిపల్లె గ్రామంలో రాయితీపై శనగ విత్తనాన్ని రైతులకు అందజేశారు. పత్తికొండ ఏడీఏ విజయ్ కుమార్, రామళ్లకోట సర్పంచ్ నిర్మల, ఏఓ అక్బర్ బాషా, ఎఫ్‌పీఓ చైర్మన్ వెంకటేశ్వర్లు, ఏఈఓ అజయ్ పాల్గొన్నారు.

పేలిన అంబులెన్స్ టైర్



టైరు పేలడంతో బండి ఆత్మకూరు వద్ద ఆగిన అంబులెన్స్

బండి ఆత్మకూరు: ప్రాణాపాయస్థితిలో ఉన్న వృద్ధుడిని నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో 108 అంబులెన్స్ టైరు పేలి గంటల కొద్దీ రోడ్డు మీద నిరీక్షించాల్సిన పరిస్థితి మండలంలో చోటు చేసుకుంది. వివరాలు.. వెలుగోడు మండలం బోయరేవుల గ్రామానికి చెందిన బిల్లా బక్కన్న అనే వృద్ధుడు తీవ్ర అనారోగ్యంతో వెలుగోడు సీహెచ్‌సీలో చికిత్స పొందుతూ వైద్యుల సూచన మేరకు కుటుంబ సభ్యులు మెరుగైన వైద్యం కోసం నంద్యాల ఆసుపత్రికి 108 వాహనంలో తరలించారు. ఈ క్రమంలో బండి ఆత్మకూరు సమీపంలోకి రాగానే వాహనం వెనక టైరు పేలడంతో అంబులెన్స్ ఆగిపోయింది. దీంతో వెంటిలేటర్‌పై ఉన్న వృద్ధుడి పరిస్థితి ఆందోళన కలిగించింది. సిబ్బంది ఆయనకు చికిత్స కొనసాగిస్తూ మరో వాహనం కోసం సమాచారం అందించారు. గంటసేపటికి మరో అంబులెన్స్ రావడంతో వృద్ధుడిని అందులోకి ఎక్కించి నంద్యాలకు తరలించారు. 108 వాహనాల నిర్వహణ సరిగా లేకపోవడంతో ఇలాంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయని బాధితుడి బంధువులు ఆవేదన వ్యక్తం చేశారు.



ఆగిన అంబులెన్స్‌లో వెంటిలేటర్ మీద ఉన్న బిల్లా బక్కన్న

విద్యుత్ సమస్యలపై ఫిర్యాదులకు అవకాశం

కర్నూలు(అగ్రికల్చర్): విద్యుత్ శాఖ కర్నూలు –2 సబ్ డివిజన్ పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, ఇతరత్రా సమస్యలపై ఫిర్యాదు చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు డీఈఈ చంద్రమోహన్ తెలిపారు. సంబంధిత ఏఈలకు లేదా ఫ్యూజ్ ఆఫ్ కాల్ నంబర్లకు ఫోన్ చేసి సమస్య చెబితే వెంటనే తగిన చర్యలు తీసుకుంటారని ఆయన బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అవసరమైతే డీఈఈ 94910 67203 సెల్ నంబరుకు కూడా కాల్ చేయవచ్చని సూచించారు.

ఫోన్ చేయాల్సిన నంబర్లు

సెక్షన్	ఏఈ సెల్ నంబర్	ఫ్యూజ్ ఆఫ్ కాల్ నంబర్
ఓల్డ్ టౌన్	9440813359	08518-240276
బి.క్యాంపు	9440813360 7382787842	08518-229862
ఇండస్ట్రియల్ ఎస్టేటు	9440816228	9440797332

మతోన్మాదిని కఠినంగా శిక్షించాలి



కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న డీహెచ్‌పీఎస్ నాయకులు

కర్నూలు(సెంట్రల్): భారత ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ బీఆర్ గవాయ్‌పై దాడి చేసిన మతోన్మాద న్యాయవాదిని కఠినంగా శిక్షించాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.మునెప్ప డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్ ఎదుట డీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. న్యాయ చరిత్రలో ఇలాంటి సంఘటన దురదృష్టకరమని, ప్రధాన న్యాయమూర్తిపై దాడికి యత్నించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. డీహెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి మహేష్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు పాల్గొన్నారు.

సీజేఐపై దాడి ప్రమాదకరం

భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడి ప్రమాదకరమని, ఇది రాజ్యాంగంపైనే దాడిగా పరిగణించవచ్చని ఆవాజ్ కమిటీ పేర్కొంది. బుధవారం ఆవాజ్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఏ సుభాన్, కమిటీ సభ్యులు పి.ఇక్బాల్ హుస్సేన్, ఎస్ఎండీ షరీఫ్‌లు ఓ ప్రకటనలో సీజేపై దాడిని ఖండించారు. సమాజంలో చీలికలు తెచ్చే కుట్రలో భాగంగానే సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడి జరిగిందన్నారు. ఇలాంటి ఘటనలు మరోసారి చోటు చేసుకోకుండా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పీఎం పర్యటన ఏర్పాట్లపై మంత్రి సమీక్ష

కర్నూలు(సెంట్రల్): ప్రధానమంత్రి నరేంద్రమోదీ కర్నూలు, శ్రీశైలంలలో పర్యటించనున్న నేపథ్యంలో ఏర్పాట్లపై రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కర్నూలు, నంద్యాల కలెక్టర్లు డాక్టర్ ఏ.సిరి, రాజకుమారి, ఆర్‌అండ్‌బీ అధికారులతో సమీక్షించారు. ప్రధాని పర్యటన వేళ ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. ఎక్కువగా ట్రాఫిక్ ఉండే ప్రాంతాలను ముందుగానే గుర్తించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. శ్రీశైలంలో రహదారుల మరమ్మతులను వేగవంతం చేయాలని, అవసరమైతే ఇతర జిల్లాల ఆర్‌అండ్‌బీ అధికారులను వినియోగించుకోవాలని సూచించారు.

ప్రధాని పర్యటనకు చురుగ్గా ఏర్పాట్లు



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సిరి

- పరిశీలించిన కలెక్టర్ సిరి

ఓర్వకల్లు: ప్రధాని నరేంద్రమోదీ ఈ నెల 16వ తేదీ జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో బుధవారం జిల్లా కలెక్టర్ సిరి సభా ప్రాంగణంలో జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. నన్నూరు టోల్ ప్లాజా సమీపంలోని రాగమయూరి గ్రీన్ హిల్స్‌లో సమారు 200 ఎకరాల విస్తీర్ణంలో బహిరంగ సభ నిర్వహించేందుకు అధికారులు నిర్ణయించారు. వాహనాల పార్కింగ్, హెలీప్యాడ్, సభా ప్రాంగణానికి సంబంధించిన ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలించారు. వాహనాల పార్కింగ్‌కు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. బహిరంగ సభకు దాదాపు 3 లక్షల మంది ప్రజలు హాజరయ్యేలా లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. అందుకు అనుగుణంగా తాగునీరు, మొబైల్ లెట్రిన్లను సమకూర్చాలని అధికారులకు సూచించారు. హెలీప్యాడ్ వద్ద పటిష్టమైన భద్రతా సిబ్బందిని ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. పనులను త్వరితగతిన పూర్తిచేయాలని ఆర్‌అండ్‌బీ ఎస్ఈని ఆదేశించారు. మెయిన్ వెన్యూ, గ్రీన్ రూమ్స్, పారిశుద్ధ్య పనులను సకాలంలో పూర్తి చేయాలన్నారు. బహిరంగ సభ, వాహనాల పార్కింగ్, హెలీప్యాడ్ తదితర ప్రాంతాల్లో సీసీ కెమెరాలను అమర్చాలని పేర్కొన్నారు. అనంతరం నన్నూరు గ్రామ సచివాలయంలో జిల్లా వైద్యాధికారులతో చర్చించారు. 11 చోట్ల పార్కింగ్ ప్రాంతాల్లో 2 బేసిక్ లైఫ్ సపోర్టు అంబులెన్స్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు. అదేవిధంగా బహిరంగ సభ ప్రదేశంలో వీవీఐపీల కోసం 10 పడకల హాస్పిటల్, సామాన్య ప్రజల కోసం 20 పడకల హాస్పిటల్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. హెలీప్యాడ్, ఓర్వకల్లు సీహెచ్‌సీల వద్ద స్పెషలిస్టు వైద్యులు, అత్యవసర వైద్య బృందాలను, మందులు, స్ట్రెచర్స్, వీల్‌చైర్స్, అవసరమైన వైద్య పరికరాలను అందుబాటులో ఉంచాలని వైద్యాధికారులను ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రధానమంత్రి పర్యటనను విజయవంతం చేయాలన్నారు. అనంతరం ఏర్పాట్లపై సీఎం ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ మంతెన సత్యనారాయణతో చర్చించారు. ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ మహేశ్వరరెడ్డి, జిల్లా వైద్యాధికారిణి శాంతికళ, ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, డీసీహెచ్ఎస్ జఫ్రుల్లా, సర్వజన వైద్యశాల అడ్మినిస్ట్రేషన్ అధికారి సింధు సుబ్రహ్మణ్యం, డీపీఓ భాస్కర్, ఐసీడీఎస్ పీడీ విజయ, కర్నూలు ఆర్డీఓ సందీప్ కుమార్, తహసీల్దార్ విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

• ప్రమాదం అంచున ప్రయాణం



కల్వర్టు కుంగిన చోట కంప పుల్లలతో సూచికలు

- కుంగిన కల్వర్టు వద్ద పుల్లలతో సూచికలు
- ఆర్‌అండ్‌బీ అధికారుల తీరుపై ప్రజల విస్మయం

సి.బెళగల్: మండలంలో రోడ్ల అధ్వాన స్థితితో ప్రయాణికులు, ప్రజలు అవస్థలు పడుతున్నారు. సి.బెళగల్ నుంచి గూడూరుకు వెళ్లే దారిలో సి.బెళగల్ శివారులోని ఇటుకల బట్టీల వద్ద ప్రధాన రోడ్డుపై కల్వర్టు రెండు వైపులా కుంగింది. రోడ్డుతో పాటు కల్వర్టు సైతం భారీగా కుంగడంతో రాకపోకలు సాగించేందుకు ప్రయాణికులు, వాహనదారులు బెంబేలెత్తుతున్నారు. కల్వర్టు కుంగిన విషయం వాహనదారులకు తెలియజేసేందుకు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాల్సిన ఆర్‌అండ్‌బీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. భారీ వాహనాలు వచ్చే ప్రధాన రహదారిపై సూచికలు ఏర్పాటు చేయకుండా కేవలం గోతులలో కంప పుల్లలు పెట్టి చేతులు దులుపుకున్నారు. వాహనదారులు దగ్గరకు వచ్చేవరకు పుల్లలు కనిపించక పోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రమాదం అంచున ప్రయాణిస్తుండటంపై వాహనదారులు, ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు కల్వర్టులను బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు.